**19. ప్రార్థన యొక్క అద్భుత శక్తి (86:10) :** ఈ భాగంలో పరస్పర విరుద్ధమైన రెండు జంటపదాలు ఉన్నాయి. కృప మరియు సత్యం; నీతి మరియు సమాధానం. కృప పాపిని విడిచిపెట్టమంటుంది. కాని సత్యం పాపం వలన వచ్చే జీతం మరణం అంటుంది. సమాధానం పాపి కలవర హృదయాన్ని నిమ్మళింపజేయాలని చూస్తుంది. కాని నీతి పాపము చేసిన ఆత్మ చావాలి అంటుంది. ఇప్పుడేమి చెయ్యాలి? అద్భుతం జరిగింది. ప్రేమ, క్రీస్తు ద్వారా ఓ మార్గాన్ని కనుగొన్నది. తత్ఫలితంగా పరస్పరం విరుద్ధంగా ఉన్న ఈ రెండు ఒకదానినొకటి ముద్దుపెట్టుకొన్నాయి. దేవునికి మనిషికి గల సంబంధంలో ప్రేమ ద్వారా ఇది ఎలా సాధ్యం అయిందో విశ్వాసుల మధ్యగల సంబంధంలోను సాధ్యం కావాలి.

**20. మొదటి ఆదాము కీర్తన :** దైవజనుడైన మోషే వ్రాసిన 90వ కీర్తన మొదటి ఆదాము కీర్తన అని, మరణ గీతిక అనికూడ పిలువబడుతున్నది. ఎందుచేతనంటే ఈ కీర్తనలో మొదటి ఆదాము పాప ఫలితంగా కలిగిన పరిణామం స్పష్టంగా కనిపిస్తుంది (90:10ని ఆది. కా 5 అధ్యాతో పోల్చి చూడండి). 12వ వచనంలో విశ్వాసి, తన జీవితకాలాన్ని జ్ఞానంతో సద్వినియోగం చేసికోవాలని, అవిశ్వాసి, జ్ఞానానికి మూలమైన యేసును విశ్వసించాలని వ్రాయబడింది. వృధా చేసిన కాలం తిరిగి రాదు సుమా!

**21. రెండవ ఆదాము కీర్తన :** జీవగీతం అని పిలువబడే 91వ కీర్తన రెండవ ఆదాము కీర్తనగా కూడ పిలువబడుతున్నది. అందుకు కారణం, రెండవ ఆదామైన క్రీస్తు ఈ భూమ్మీద సంచరించినప్పుడు తండ్రి ఆయనను కాపాడిన వైనాన్ని 91:11,12 లో చూడగలం. సాతాను ఆయనను శోధించినప్పుడు సాతాను ఇదే వచనాన్ని ఎత్తి చెప్పాడు. యేసు జీవితంలో దూతల పలువిధ పరిచర్య గూర్చి హెబ్రీ 1:6, లూకా 1:26-38; 2:8-14; మత్త 1:20-23; మత్త 4:11, లూకా 22:43; మత్త 28:2,6; అపొ 1:10, 11; II థెస్స 1:7,8) వ్రాయబడ్డాయి.

**22. దేవుని వాక్యం :** కీర్తన గ్రంథంలోని భక్తిగీతాలన్నిటిలో ప్రధానమైనది, అతి పెద్ద ప్రార్థన 119వ కీర్తన. ఈ ప్రార్థన మూలమంతా, దాని అర్థమంతా దేవుని వాక్యమే. ఇందులోని 176 వచనాల్లో 171 వచనాలు వాక్యం గూర్చే వ్రాయబడ్డాయి. వాక్యానికి 9 పర్యాయ పదాలు ఉపయోగించబడ్డాయి (1-7, 9, 91వచనాలు). వాక్యం మనలో 12 విధాలుగా కార్యం చేస్తుంది (9,25,28,38,42,50,98,99,105,114,116, 165,170 వచనాలు).

ప్రసంగికుల రాజు అయిన డి.ఎల్. మూడీ గారు కీర్తన 119:11 ను ఆధారం చేసికొని "బైబిలు ఒక వ్యక్తిని పాపానికి దూరంగా ఉంచుతుంది. లేదా పాపం అతన్ని బైబిలుకు దూరంగా ఉంచుతుంది". ఇంత శ్రేష్ఠమైన వాక్యానికి మనమెంత ప్రాధాన్యత నిస్తున్నామో పరీక్షించుకోవాలి. ఈ కీర్తనలోని 89వ వచనాన్ని ప్రభువు పదే పదే ప్రస్తావించాడు

(మత్త 24:35; 5:18) దావీదు తన జ్ఞానాన్ని గూర్చి అతిశయించలేదు, ఆ ఘనతను తన సలహాదారులకు ఆపాదించలేదు కాని వాక్యానికే ఆపాదించాడు. (99వ) దేవుని వాక్యం మన పాదాలకు దీపము మన త్రోవకు వెలుగుగా ఉండి నడిపిస్తుంది (105వ) గాని, సాతాను వెలుగు మనిషి మనోనేత్రాలకు అంధత్వం కలుగుజేస్తుంది. దేవుని వాక్యం ఆధ్యాత్మిక శిశువులకు పాలుగా, ఎదిగిన వారికి బలమైన ఆహారంగా ఉంటుంది (130వ).

## II. పశ్చాత్తాప కీర్తనలు : (6,32,38,51,102,130,143)

ఈ 7 కీర్తనలలో 5 కీర్తనలను దావీదు వ్రాసాడు.

**1. పాప పరిణామము :-** 32వ కీర్తనకు 51వ కీర్తనకు సన్నిహిత సంబంధం ఉంది. దావీదు 51వ కీర్తనలో తన పాపాన్ని ఒప్పుకొనకముందు, పాప ఫలితంగా పొందిన అనుభూతులను 32వ కీర్తనలో వ్రాసాడు. ఈ కీర్తనలోని 1,2 వచనాలను ఆధారం చేసికొని పౌలు “ఆపాదించబడుట” అనే గొప్ప సిద్ధాంతాన్ని వివరించాడు (రోమా 4:7,8). ఒక వ్యక్తి ఖాతాకు మరోవ్యక్తి చేర్చిన దానిని ఆపాదించుట, మోపబడుట, లేక సంక్రమించుట అంటారు. అలాంటివి బైబిల్లో మూడు ఉన్నాయి.

అ) ఆదాము పాప స్వభావం మానవ జాతికి సంక్రమించుట (రోమా 3:23; 5:12)

ఆ) మానవ పాపం క్రీస్తుపై మోపబడుట (యెష 53:5,6; హెబ్రీ 2:9; **II** కొరి 5:14-21; **I** పేతు 2:24)

ఇ) విశ్వసించిన పాపికి, క్రీస్తు నీతి ఆపాదించబడుట (ఫిలి 3:9; యాకో 2:23; రోమా 4:6-24)

**2. పాపపు ఒప్పుకోలు :** 51వ కీర్తనను దావీదు ఏ సందర్భంలో వ్రాసాడో మనందరికీ తెలుసు. దేవుడు ప్రతి పాపినుండి దేనిని కోరతాడో దానితో అతడు ఆరంభించాడు. అతని పాపాన్ని గుర్తించి ఒప్పుకొన్నాడు. తన పాపానికి కారణం మరేదో కాదని తానేనని అంగీకరించాడు. దేవుడు మనం చెప్పే నెపాలను అంగీకరించడు గాని పశ్చాత్తాపంతో కార్చే కన్నీళ్ళను అంగీకరిస్తాడు. దావీదు బెత్షెబకు, ఊరియాకు, తనను నమ్మిన ఇశ్రాయేలీయులకు విరోధంగా పాపం చేసాడు. అది దేవునికి విరోధంగా చేసిన పాపమని గుర్తించాడు (51:4). మనం చేసే పాపాలు ఇతరులకు విరోధంగా చేసినట్లు అనిపిస్తాయి. కాని అవి దేవునికి విరుద్ధమైనవి. తన పాపశుద్ధీకరణ కోసం దావీదు ప్రార్థన చేసినప్పుడు (51:7) బహుశా నిర్గ 12:21-23 జ్ఞాపకం చేసికొని ఉండవచ్చును. దావీదు వంశంలో నుండి వచ్చిన యేసు క్రీస్తు విశ్వాసులందరికోసం ప్రతిరోజు ఈ పరిచర్యను చేస్తున్నాడు (హెబ్రీ 1:3). మన పాపం మనలో నివసించే పరిశుద్ధాత్మను దుఃఖపర్చేంతగా ఉండకూడదు (11వ). విశ్వాసి తన మొదటి ప్రేమను

కోల్పోయినప్పుడు (ప్రక 2:4) ఎలా ప్రార్థించాలో 12వ వచనం నేర్పిస్తుంది. రక్షణానందాన్ని తిరిగి పొందిన వారిలోని మార్పును 13వ వచనం తెలియజేస్తుంది. ఈ కీర్తన మరో ముఖ్యమైన సత్యాన్ని బోధిస్తుంది. ధర్మశాస్త్రం ప్రకారం వ్యభిచార పాప పరిహారానికి ఏ బలి లేదు. ఆవ్యక్తి చంపబడాలి (లేవీ 20:10). కాబట్టి దావీదు తనను తానే, అనగా విరిగి నలిగిన హృదయాన్ని బలిగా అర్పించి దేవుని కృపకు అప్పగించుకున్నాడు.

## III. శాప గీతాలు : (35,55,58,59,69,83,109,137,140)

ఈ కీర్తనలను మత్తయి 5:44తో పోల్చితే కొంత వివాదాస్పదంగా కనిపిస్తాయి. ఈ కీర్తనలలో ఇతరులకు వ్యతిరేకంగా వారికి కీడు జరగాలని ప్రార్థించడం గమనించవచ్చు. అది సబబేనా? డా॥ రాయ్. ఎల్ ఆల్డ్రిక్ వీటిని గూర్చి చెప్పిన విషయాలను గమనిద్దాం.

1. ఈ కీర్తనలన్నీ పరిశుద్ధాత్మ ప్రేరణలో వ్రాయబడ్డాయి. ఆయనకు పాపి యొక్క పాపాన్ని ఖండించే అధికారం ఉంది.
2. అది ధర్మశాస్త్రానుసారమైనదే. (సామె 28:4; యిర్మీ 50:15)
3. కీడుకు మరియు కీడు చేసేవారికి అలాంటి తీర్పు ఉంటుందని క్రీస్తు బోధల్లోను, పత్రికలలోను కనిపిస్తుంది. (మత్త 18:6; 23:33; గల 1:8,9; 5:12; యాకో 5:3; యూదా 13, 15; IIపేతు 2:12, 22; II థెస్స 2:10-12; ప్రక 14:10,11).
4. లేఖనాలు, పాపము చేసే ఇశ్రాయేలీయులందరికీ శాపాలను ప్రకటించాయి లేక ఉచ్ఛరించాయి. (లేవీ 26 అధ్యా; ద్వితీ 27-28 అధ్యా. యెష 5:24,25; 28:13).
5. వ్యక్తిగతంగా దావీదు, తాళిమి మరియు క్షమా హృదయం గల వాడే, కాని ఈ మాటలను పలకడం వలన అతడు దేవుని పనిని తన పనిగా ఎంచాడు (5:10,11). ముఖ్యంగా ఎక్కువగా నలిగిన వారికి కలిగిన బాధను బట్టి వారిపట్ల జాలితో పలికిన మాటలివి (10:8-10).
6. కొన్ని శాపాలు ప్రవచనాత్మకంగా చెప్పబడ్డాయి. (కీర్త 137:8,9) (యెష 13:16; యిర్మీ 50:15; 51:6,36 కూడ చదవండి).
7. మరికొన్ని యుద్ధాలలో పొందిన జయాన్ని బట్టి చేసిన ప్రార్థనలు (కీర్త 144:5-7)
8. కొన్ని శాపాలు క్రీస్తుకు ద్రోహం చేసిన వారిని గూర్చి పలుకబడ్డాయి. (40,55,60) 69:22-25 లో యూదా ఇస్కరియోతుకు కలిగేశిక్షను గూర్చి ప్రస్తావించబడింది.
9. ఈ కీర్తనలు, దుష్టులను ఆధ్యాత్మిక భ్రష్టులని నిశ్చయంగా చెప్తూ దేవుని సార్వభౌమత్వాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రవచనాత్మకంగా వ్రాయబడ్డాయి. దుష్టులకు ఈ భూమ్మీద జరుగబోయే అంతిమ తీర్పు కొరకు కనిపెడుతున్నట్లు ఈ కీర్తనలు స్పష్టం చేస్తున్నాయి.

10. వారిని పదే పదే హెచ్చరించడం ద్వారా వారి పట్ల గల కృప ధైర్యంగా వెల్లడించబడింది.

**IV. (మహోన్నతమైన) ఔన్నత్య గీతాలు :** ఇవి మొత్తం 15. వీటిలో 10 కీర్తనలను అనగా 120,121,123,125,126,128-130; 132,134 హిజ్కియా వ్రాసాడు. 127వ కీర్తనను సొలొమోను మిగతా నాలుగింటిని అనగా 122,124,131,133 దావీదు వ్రాసాడు క్రీ.పూ. 728లో స్వస్థతను పొందిన హిజ్కియా కృతజ్ఞతా పూర్వకంగా వీటిని వ్రాసాడు. వాటిని దేవుని మందిరంలో ప్రజలందరూ అర్ధవలయాకారంలో నిలిచి ఉండగా గాయక బృందం ఉన్నత స్థలంలో మెట్ల పై నిలబడి పాడాలి. వాటి రాగాలు కూడ క్రమేణ అతి తారస్థాయికి పెరుగుతాయి. వీటిలో వివిధ వార్షిక పండుగల కొరకు యెరూషలేముకు వెళ్ళే యాత్రికులు పాడుకొనే పాటలు కూడ ఉన్నాయి.

**V. హల్లేల్ (హల్లెలూయ) కీర్తనలు (113-118) :** ఈ ఆరు కీర్తనలు కూడ పస్కా ఆచరించే రాత్రి పాడాలి. భోజన ఆరంభంలో 113, 114వ కీర్తనలు, ముగింపులో 115, 116వ కీర్తనలు పాడాలి. యేసు ప్రభువు, ఆయన శిష్యులు కూడ వీటిని పాడారు. (మత్త 26:30), నేటికీ, ప్రతి సంవత్సరం పాలస్తీనలోని యూదులు వివిధ సందర్భాలలో 18 సార్లు, పరిశుద్ధ స్థలానికి వెలుపలనున్న యూదులు 21 సార్లు ఈ కీర్తనలను పాడుకొంటారు.

**VI. చరిత్రాత్మక కీర్తనలు (70, 105, 106) :** ఇవి ఇశ్రాయేలు చరిత్రను గూర్చిన కీర్తనలు. వీటిలోని అంశాలను రెండు భాగాలుగా పేర్కొనవచ్చును.

1. ఇశ్రాయేలు పాపము (78:10,11,19,22,36,40,41,42,58; 106:13, 19,24,25,28,35,37,38)
2. దేవుని కృప (78:13,14,15,24,38,43,54,55,70,71; 105:8-11,14,17, 27-37; 106:43,44).

**VII. అక్షరమాల కీర్తనలు (బంధకావ్యం) :** 9,10,25,34,37,111,112, 119,145వ కీర్తనలు, ప్రతి వరుస కూడ హెబ్రీ అక్షరమాలలోని ఏదో ఒక అక్షరంతో ఆరంభం అవుతుంది. 119వ కీర్తనలో 22 భాగాలున్నాయి. ప్రతి భాగంలోని 8 వచనాలు ఒక హెబ్రీ అక్షరంతో ఆరంభమౌతాయి. మిగతా కీర్తనల్లో ఈ క్రమం లేదు. 9,10,25 కీర్తనల్లో చాలా అక్షరాలు లేవు. 34,35, కీర్తనల్లో ఒక్క అక్షరం తప్ప మిగతావన్నీ ఉన్నాయి. 37,111,112,119 వ కీర్తనల్లో అన్ని అక్షరాలు ఉన్నాయి. ప్రజలు వీటిని జ్ఞాపకం ఉంచుకొనేందుకు వీలుగా ఇలా వ్రాయబడ్డాయి.

**VIII. మెస్సీయా కీర్తనలు :** ఇవన్నీ ద్వంద్వ విధానంలో వ్రాయబడిన ప్రాముఖ్యమైన కీర్తనలు.

ఎ. మెస్సీయాను గూర్చిన విషయాలు – కీర్తనల గ్రంథం – క్రొత్త నిబంధనలో నెరవేర్పు.

1. ఆయన విధేయత – 40:6-10 – హెబ్రీ 10:5-7
2. ఆయన ఆసక్తి – 69:9 – యోహా 2:17
3. ఆయన తిరస్కరించబడుట – 118:22 – మత్త 21:42
4. ఆయన అప్పగించబడుట – 41:9; 55:12-14 – మత్త 26:14-16, 21-25)
5. ఆయన శ్రమలు – (22:1,6,7,8,16,19; 69:21; 31:5,34;20; 129:3) – మత్త 27:34-48 లూకా 23:46; యోహా 19:33-36)
6. ఆయననుగూర్చి చెప్పబడిన అబద్ధసాక్ష్యాలు–109:2,3–మత్త 26:59-61; 27:39,44)
7. శత్రువుల కోసం ఆయన చేసిన ప్రార్థన – 109:4 – లూకా 23:34
8. ఆయన పునరుత్థానం – 16:10; 22:22 – అపొ. 13:35; యోహా 20:17
9. ఆయన ఆరోహణం – 68:18; 24:7,8 – ఎఫె 4:8; అపొ 1 అధ్యా.
10. ప్రధానయాజకుని పని – 110:4 – హెబ్రీ 5-7 అధ్యా.
11. వివాహం – 45:2,6,8,13,15 – ప్రక 19 అధ్యా.
12. అన్యుల నాశనం – 110:1,6; 2 కీర్త – ప్రక 6-19 అధ్యా.
13. వెయ్యేండ్ల పాలన – 89:27; 102:16-21;72:17–మత్త 23:39; ప్రక 11:15.

బి. కీర్తనల గ్రంథంలోని వరుస క్రమం. వీటిలో కొన్ని ప్రాముఖ్యమైన వాటిని చూద్దాం.

1. 24వ కీర్తన క్రీస్తు పరలోక ప్రవేశాన్ని సూచిస్తున్నది. ఇది రెండు గాయక బృందాలు పాడినది. 1-3 వచనాల్లో మొదటి బృందం వేసిన ప్రశ్నకు 4-6 వచనాల్లో రెండవ బృందం జవాబిస్తున్నది. ఇది ఓ కొండ దిగువ భాగాన పాడినది. 7-10 వచనాలు పట్టణ ద్వారం వద్ద పాడినది.
2. మందిరంలో ఉదయారాధనలో పాడే పాటలు : సోమవారం 48వ కీర్తన, మంగళవారం 82వ కీర్తన, బుధవారం 94వ కీర్తన, గురువారం 81వ కీర్తన, శుక్రవారం 93వ కీర్తన, శనివారం 92వ కీర్తన, ఆదివారం 24వ కీర్తన.
3. 45వ కీర్తన బహుశా ఐగుప్తురాజు కుమార్తెతో సొలొమోనుకు జరిగిన వివాహాన్ని ఆధారం చేసికొని వ్రాయబడి ఉండవచ్చు. కాని ఈ చారిత్రాత్మక గీతం సంఘంతో క్రీస్తుకు జరుగబోయే వివాహానికి సరిగ్గా సరిపోయింది (ప్రక. 19:7-9). ఈ కీర్తన మొదటి భాగంలో పెండ్లి కుమారుని లక్షణాలు (1-8వ) రెండవ భాగంలో

పెండ్లి కుమార్తె ఆధిక్యతలు (8-17వ) వ్రాయబడ్డాయి. 6,7 వచనాలు హెబ్రీ 1:8,9వ వచనాలలో ప్రస్తావించబడ్డాయి.

4. దావీదు సింహాసనం : దావీదు సింహాసనాన్ని స్థిరపరచుటలో దేవుని మారని విశ్వాస్యతను గూర్చిన ప్రవచనం 89వ కీర్తనలో వ్రాయబడింది. ఆ రాజవంశంలో అవిధేయత కొనసాగుతూ ఉన్నా దేవుడు మరో విధానంలో అతని సింహాసనాన్ని స్థిరపర్చాడు. ఈ కీర్తనను వ్రాసిన ఎజ్రాహీయుడైన ఏతాను సొలొమోను పాలనా కాలంలో ఒక జ్ఞాని. (I రాజు 4:31) కీర్త 89:27 లోని మాటలు ఫిలి 2:9-11లో వివరించబడ్డాయి.

5. క్రీస్తు నిత్యత్వం (కీర్త 102) : ఈ కీర్తన బహుశా బబులోను చెరకాలం ముగింపులో, యూదులు తిరిగి యెరూషలేమును కట్టాలని ప్రోత్సహించడానికి వ్రాయబడి ఉండవచ్చును. యెరూషలేము యొక్క మహారాజు పునరాగమనమును గూర్చి కూడ 16వ వచనంలో వ్రాయబడినది. 25-27 వచనాలలోని మెస్సీయా ప్రవచనం హెబ్రీ 1:10-12 లో ప్రస్తావించబడింది.

6. క్రీస్తు శాశ్వత యాజకత్వం : క్రీస్తును ప్రధాన యాజకునిగా వర్ణిస్తూ వ్రాయబడిన 110వ కీర్తనలో కీర్తనాకారుడు క్రీస్తును ఐదు విధాలుగా వర్ణించాడు ఆయన దేవుడని (1వ) రాజని (2వ) యాజకుడని (4వ) న్యాయాధిపతి అని (5వ) యోధుడని (6వ) వర్ణించాడు. అలాగే క్రీస్తు ప్రజలను రెండు విధాలుగా వర్ణించాడు. క్రీస్తు ప్రజలు యాజకులు (3వ). ప్రక 1:6 తో పోల్చి చూడండి. క్రీస్తు ప్రజలు సైనికులు (3వ) ఎఫె 6:11 తో పోల్చిచూడండి.

110:1 లో వ్రాయబడిన "ప్రభువు నా ప్రభువుతో సెలవిచ్చిన వాక్కు - నేను నీ శత్రువులను నీ పాదములకు పీఠముగా చేయువరకు నాకుడి పార్శ్వమున కూర్చుండుము." అన్న మాటలు పాత నిబంధనలోని ఇతర వచనాలన్నిటి కన్న ఎక్కువ సార్లు క్రొత్త నిబంధనలో పునః ప్రస్తావించబడ్డాయి. మత్త 22:41-46లో క్రీస్తు దైవత్వాన్ని గూర్చి, అపొ. కా 2:34, 35 లో క్రీస్తు గుర్తింపును గూర్చి హెబ్రీ 1:13లో క్రీస్తు ఔన్నత్యాన్ని గూర్చి, హెబ్రీ 10:12, 13 క్రీస్తు పూర్తి చేసిన కార్యాన్ని గూర్చి తెలిపేందుకు ఉపయోగించబడ్డాయి.

అలాగే ఆయన యాజకత్వానికి సంబంధించిన "మెల్కీసెదెకు క్రమము చొప్పున నీవు నిరంతరము యాజకుడవై యుందువు" అన్న మాటలు కూడ మూడు పర్యాయాలు పేర్కొన బడ్డాయి. (హెబ్రీ 5:6; 6:20; 7:21) ప్రధాన యాజకునిగా

క్రీస్తు లక్షణాలను, మార్పులేని యాజకత్వాన్ని, ఆ యాజకత్వపు అవసరతను సూచిస్తూ వ్రాయబడ్డాయి.

7. ముఖ్యమైన మూలరాయి : 118వ కీర్తన క్రీస్తును దేవుని నిర్మాణంలో మూలరాయిగా వర్ణిస్తున్నది. అది మనుష్యులచే విసర్జించబడింది గాని దేవునిచే ఏర్పరచబడినది. సాధారణంగా పర్ణశాలల పండుగ సమయంలో ఈ కీర్తనను పాడేవారు. బహుశా ప్రభువు గెత్సేమనేకు వెళ్ళే మార్గంలో ఈ పాటను పాడి ఉండవచ్చును. 22లో వ్రాయబడిన ఈ రాయి లేఖనాలలో అత్యున్నతమైన రాయి. దీనిని గూర్చి పాత నిబంధనలోను క్రొత్త నిబంధనలోను పలు విధాలుగా వర్ణించబడింది. ఆయన మూలరాయి (మత్త 21:42; ఎఫె 2:20), తలరాయి (పైరాయి) (జెక 4:7; అపో 4:11) కొట్టబడిన రాయి (I కొరి 10:4) అడ్డుబండ (I పేతు 2:7) విరుగగొట్టే రాయి (దాని 2:34) సజీవమైన, ఏర్పరచబడిన, అమూల్యమైన రాయి. (Iపేతు 2:4-7).

ప్రియ సోదరా! సోదరీ! అటువంటి శ్రేష్ఠమైన రాయి వద్దకు మనం వచ్చాము. ఎందు నిమిత్తం వచ్చామో తెలుసా? యేసు క్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలులర్పించుటకు, పరిశుద్ధయాజకులుగా ఉండునట్లు, మనము కూడ సజీవమైన రాళ్ళవలె నుండి ఆత్మ సంబంధమైన మందిరంగా కట్టబడాలి. ఈ బాధ్యతను నిర్వర్తిస్తూ ఉండగా, పలు గాయకుల, కీర్తనాకారుల అనుభవాలతో నిండి ఉన్న కీర్తనల గ్రంథం మన జీవిత అనుభవంగా మారిపోవాలి. అట్టి కృప ప్రభువు మనకు దయచేయును గాక!

